ప్రజాశక్తి

ఆదివారం 12 ఫిబ్రవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

అపరాల ధరలు పతనం

- మార్కెట్‌లో తగ్గిన డిమాండ్
- రైతులకు కష్టం
- వినియోగదారులకు ఊరట







ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు,పల్నాడు జిల్లాలో అపరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఖరీఫ్, రబీ సీజన్‌లో అపరాల సాగు చేసిన రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం స్థిరంగా ఉన్న ధరలు ఉత్పత్తులు చేతికి వచ్చే ముందు నేలచూపులు చూస్తున్నాయి. గత నెల రోజుల కాలంలో మినుములు, పెసలు, కందులు, శనగల ధరలు తగ్గుతూ వస్తున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన ఉత్పత్తుల విక్రయానికి రైతులు ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రూ.8 వేల వరకు పలికిన శనగల ధరలు ప్రస్తుతం రూ.5 నుంచి రూ.6 వేల వరకు పలుకుతోంది. మార్కెట్‌లో పచ్చిశనగ పప్పు ధర కిలో రూ.65 పలుకుతోంది. వేయించిన శనగ పప్పు (పుట్నాలు) ధర రూ.95 పలుకుతోంది. మినుముల ధరలు గత నెలలో రూ.7 వేల వరకు ఉండగా ప్రస్తుతం 6 వేలకు తగ్గింది. బహిరంగ మార్కెట్‌లో మినప గుళ్ల ధర కిలో రూ.100కి తగ్గింది. పెసలు ధర గత నెలలో రూ.7 వేలు ఉండగా ప్రస్తుతం రూ.6 వేలకు తగ్గింది. పెసరపప్పు ధర మార్కెట్‌లో రూ.90 నుంచిరూ.95 వరకు పలుకుతోంది. అలాగే కందిపప్పు ధరలు కూడా కొంత మేరకు తగ్గాయి.ప్రస్తుతం కందుల ధరలు కూడా తగ్గాయి. గతేడాది ఇదే సమయంలో రూ.8 వేల వరకు పలికిన కందుల ధరలు ఈ ఏడాది రూ.6 వేలకు తగ్గాయి. ప్రస్తుతం కందిపప్పు ధర రూ.100 నుంచి రూ.110 వరకు లభిస్తుంది. రేషన్ కందిపప్పుధర రూ.67 ఉండగా ఇవి సక్రమంగా అందకపోవడం వల్ల రిటైల్ మార్కెట్‌లో ధర రూ.100కి తగ్గడం లేదు. మొత్తంగా రైతులకు కొంత నష్టం వస్తుండగా ధరలు తగ్గడం వల్ల వినియోగదారులకు ఊరటకల్గుతోంది.వరి,పత్తి సాగు వల్ల పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో చాలామంది రైతులు రెండో పంటగా అపరాల సాగు చేశారు. కొన్ని మండలాల్లో సాధారణ విస్తీర్ణం కన్నా సాగు తగ్గింది. అయినా ఈఏడాది ధరలు పెరగకపోగా తగ్గుతున్నాయి. గుంటూరు జిల్లాలో 25 వేల ఎకరాల్లో శనగ పంట వేయాల్సి ఉండగా 18 వేల ఎకరాల్లో, పెసర 26 వేల ఎకరాలకు గాను 20 వేల ఎకరాల్లో, మినుము 16 వేల ఎకరాలకు గాను 11 వేల ఎకరాల్లో వేశారు. పల్నాడు జిల్లాలో శనగ 30 వేల ఎకరాలకు గాను 19 ఎకరాలు, పెసర 1500 ఎకరాలకు గాను కేవలం 230 ఎకరాల్లో, మినుము ఐదు వేల ఎకరాలకు గాను వెయ్యి ఎకరాల్లో సాగు చేశారు. అలాగే ఖరీఫ్‌లో కూడా రెండు జిల్లాల పరిధిలో 40 వేల ఎకరాల్లో కంది

2లో



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలి

బట్టీ చదువులతో ఉపయోగం ఉండదు : జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ఉత్సాహంగా ప్రారంభమైన గుంటూరు బాలోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

బట్టీపట్టే చదువులు వల్ల ఉపయోగం లేదని, పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఐఐటి, ఐఐఎంలే కాకుండా విస్తృతంగా ఉన్న విద్యావకాశాలను అందిపుచ్చుకోవాలని, పిల్లలకు ఇష్టం ఉన్న రంగంలో చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. స్థానిక లక్ష్మీపురంలోని, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో పిల్లల పండుగ పేరుతో గుంటూరు బాలోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా బాలోత్సవం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి విద్యా విధానంలో ఉదయం నుండి రాత్రి

2లో



హాజరైన విద్యార్థులు

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియోకు సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - నరసరావుపేట



శరత్ మృతదేహం

విద్యుత్‌షాక్‌తో కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఫిరంగిపురం మండలం పొనుగుపాడుకు చెందిన కార్మికుడు శరత్ (29) నరసరావు పేటలోని బరంపేటలో బహుళ అంతస్థుల సముదాయంలో పనిచేస్తాడు. రోజు మాదిరిగానే శనివారం నీటి సరఫరా పైప్ లైన్ ఏర్పాటు కొరకు పని చేస్తున్న క్రమంలో యంత్రం సహాయంతో గోడ పగులగొడుతుండగా ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన వెంటనే తోటి కార్మికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలియగానే సిఐటియు నరసరావుపేట పట్టణ కార్యదర్శి కాసు కోటిరెడ్డి, ఫిరంగిపురం మండల కార్యదర్శి సుభాని ఏరియా ఆస్పత్రిలో కార్మికుడు శరత్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కార్మికుని కుటుంబానికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మృతుడు శరత్‌కు తొమ్మిదినెలల క్రితం వివాహం అయ్యింది. ప్రస్తుతం అతని భార్య ఆరెనెలల గర్భిణి అని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్మికుడు శరత్ మృతికి సిఐటియు పల్నాడు జిల్లా కోశాధికారి డి శివకుమారి, నాయకులు షేక్ సిలార్ మసూద్, ఈవూరి మస్తాన్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. శరత్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, తక్షణం మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.

విజయవాడ ఎంబివికెలో నేడు త్రిపుర సంఘీభావ సభ

ప్రజాశక్తి - విజయవాడ

'త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరపాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' నినాదంలో 12వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు విజయవాడ రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో త్రిపుర సంఘీభావ సభ జరుగుతుంది. ఈ సభలో వక్తలుగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎం.ఎ.బేబి, బి.వి.రాఘవులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



మాట్లాడుత్నున్న కత్తిపద్మారావు

కార్పొరేట్ల పోకడలకు కళ్లెం వేయాలి

అరసం 19వ రాష్ట్ర మహాసభలో కత్తి పద్మారావు

యువతను అభ్యుదయవాదం వైపు నడిపించాలి : సుఖ్‌దేవ్‌సింగ్ సిర్సా

వార్త మెయిన్‌లో

సుప్రీం విచారణపై పెరుగుతున్న ఉత్కంఠ



వీక్షణం

4వ పేజీలో



చిన్నారితో శస్త్రచికిత్స చేసిన జిజిహెచ్ వైద్యుల బృందం

కాలిమెట్టె మింగిన చిన్నారి

శస్త్ర చికిత్సతో తొలగించిన జిజిహెచ్ వైద్యులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

కాలిమెట్టె మింగి చికిత్స కోసం శనివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చిన నాలుగు నెలల చిన్నారికి నిమిషాల్లో గ్యాస్ట్రో ఏంట్రాలజీ వైద్యులు ఎండో స్కోపి ద్వార శస్త్ర చికిత్స చేసి ప్రాణాలను కాపాడారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఏనుగు పాలెంకు చెందిన ఏ అరుణ్ కుమార్ శ్రీవల్లి దంపతుల నాలుగు నెలల కూతురు నాణెం మింగిదంటూ ఆందోళనతో శనివారం గుంటూరు జిజిహెచ్ అత్యవసర విభాగానికి వచ్చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా, పిజి వైద్యులు అనీల్ కుమార్ రోగిని పరీక్షించడంతో కాలి మెట్టె ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వైద్యులు ఎండో స్కోపి ద్వారా కాలి మెట్టేను అన్న వాహిక నుంచి బయటకు తీసారు. ఈ మేట్టే కడుపులో ఉండటం వల్ల పేగుల్లో రంధ్రాలు పడి ప్రాణాలకే ముప్పు ఏర్పడేదని వైద్యులు తెలిపారు. సకాలంలో చిన్నారిని కాపాడిన వైద్య బృందాన్ని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తదితరులు అభినందించారు.

అపరాల ధరలు పతనం

(మొదటి పేజీ తరువాయి)

సాగు చేయగా ప్రస్తుతం మార్కెట్‌లో నూతన దిగుబడులు వచ్చిఉన్నాయి. ఖరీఫ్‌లో మినుము,పెసర, శనగ విస్తీర్ణంకూడా బాగా తగ్గింది. అయినా ధరలు పెరగడం లేదు. రాష్ట్రంలో పండించిన ఉత్పత్తుల కన్నా ఇతర రాష్ట్రాల నుంచి అపరాల దిగుబడి అధికంగాఉందని వ్యాపారులు చెబుతున్నారు. కంది పప్పు మహరాష్ట్రనుంచి ఎక్కువగా వస్తున్నాయి. వీటి ధర కిలో రూ.120 వరకు ఉంటోంది. అలాగే శనగలు తెలంగాణ, కర్నాటక నుంచి దిగుమతి చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న దిగుమతులతో గుంటూరు, పల్నాడు జిల్లాలో అపరాల సాగు చేస్తున్న రైతులు తగిన ధరలు రావడం లేదు. దీంతో వరి, పత్తి పంటలతోపాటు అపరాల సాగుకు కూడా రైతులు ఉత్సాహంగా ముందుకు రావడంలేదు.


రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న విద్యార్థులు

పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలి

(మొదటి పేజీ తరువాయి)

వరకూ విద్యార్థులను పంజరంలో బందించినట్లు చదువులు సాగుతున్నాయన్నారు. వాటి వల్ల ఉపయోగం లేదన్నారు. ఉపాధ్యాయుడు చెబుతున్నది అర్థం చేసుకొని చదవటమే ముఖ్యమన్నారు. ఒత్తిడి లేని విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యలో అనేక సంస్కరణలో చేపడుతుందని, వాటికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీయటానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సుమారు 25 బాలోత్సవాలు నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లో వంద వరకూ నిర్వహించి, విద్యార్థులను ప్రోత్సహించాలన్నది తమ లక్ష్యమన్నారు. రెండ్రోజులపాటు జరిగే ఈ పిల్లల పండుగను వినియోగించుకోవాలని కోరారు. అమరావతి బాలోత్సవం ప్రతినిధి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ రంగాలుగా విద్య విడిపోయిన నేపథ్యంలో వారందర్నీ ఒకే వేదికపైకి తెచ్చి, విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ఒకరినొకరు పంచుకోవటానికి బాలోత్సవం మంచి వేదిక అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఊహాశక్తిని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లతోపాటు, మ్యూజిక్, డ్రాయింగ్, స్పోర్ట్స్ టీచర్లు, లైబ్రేరియన్‌లు తప్పని సరిగా ఉండాలన్నారు. హిందూ కాలేజి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ గత పదిహేనేళ్లలోనే విద్యలో ఒత్తిడి పెరిగిందని, ఆ ఒత్తిడిని అధిగమించటానికి ఇటువంటి బాలోత్సవాలు విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

సమాజంలో కులం, మతం విభజన ఉన్న నేపథ్యంలో పిల్లల్లో స్నేహభావం పెంపొందించటానికి ఇలాంటి బాలోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. బాలోత్సవం కన్వీనర్ యం.బోసుబాబు మాట్లాడుతూ 2020లో నిర్వహించిన బాలోత్సవానికి అనూహ్య స్పందన వచ్చిందని, తర్వాత కోవిడ్ వల్ల రెండుళ్ల విరామం వచ్చిందన్నారు. ప్రస్తుతం కొత్త గుంటూరు జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న బాలోత్సవానికి గతం కంటే మంచి స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఎస్ఈ. జి.బ్రహ్మయ్య, అమరావతి బాలోత్సవం ప్రతినిధి, రామరాజు, గుంటూరు బాలోత్సవ ప్రధాన కార్యదర్శి బి.ప్రసాదు, కన్వీనర్లు దుర్గా ప్రసాదు, డాక్టర్ ఏ. సత్యనారాయణ ప్రసాదు, టీఆర్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసు చర్యలు

- పల్నాడు కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఏబీఎన్ ఆస్తులకు సంబంధించి కోర్టు ఉత్తర్వుల మేరకు పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని బిఆర్ అంబేద్కర్ స్పందన హాల్లో శనివారం అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీస్ భూముల వివాదంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ మాసంలో పలనాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినుకొండకు చెందిన ఏబీఎన్ కాంపౌండ్ అమెరికన్ బాప్టిస్ట్ ఫారెన్ మిషనరీ సొసైటీ ,ప్రాపర్టీ అసోసియేషన్ ఆఫ్ బాప్టిస్ట్ చర్చ్ వారి సంయుక్తంగా కలెక్టర్ ని కలిసి చేసిన ఫిర్యాదు పై చర్చించారు. కోర్టు ఉత్తర్వులను పరిశీలించి హాజరైన సభ్యులకు వివరించారు. రెవెన్యూ, పోలీస్ శాఖలు కోర్టు ఉత్తర్వులు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూమి వివాదం కోర్టు పరిధిలో ఉందని వివరించారు. ఏబీఎన్ ఆస్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి సదరు భూముల క్రయవిక్రయాలపై జాగ్రత్తలు వహించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీవినాయకం, వినుకొండ మండల రెవెన్యూ అధికారి కిరణ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

గురుకుల బాలికలకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ఆత్మ విశ్వాసాన్ని ఆయుధంగా మలుచుకుంటే విజయం మీ సొంతం అందుతుందని సత్తెనపల్లి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇంచార్జి సిఐ టి.తులసి అన్నారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణా పురం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య- ప్రేరణ కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి విద్యార్థినీలకు స్టడీ మెటీరియల్స్ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి సెబ్ ఇంచార్జ్ సిఐ టి తులసీలు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ స్వర్ణ కుమారి అధ్యక్షత వహించారు. సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి మాట్లాడుతూ ఆడపిల్లల్లో అనంతమైన శక్తి దాగి ఉంటుందని వారు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ముందుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్నికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లి బాబు, సభ్యులు సురేష్, శేఖర్,లతా, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయ బందము విద్యార్థిని లు పాల్గొన్నారు



మెటీరియల్ అందజేస్తున్న సెబ్ సిఐ టి. తులసి



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-నరసరావుపేట

మండలంలోని కేసానుపల్లి పరిధిలో గల ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కనుమూరి రాజ్యలక్ష్మి , ఈశ్వర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, బొల్లా కోటేశ్వరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మెదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులలో స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పేందుకు ఫ్రెషర్స్ డే వేడుకలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థి జీవితంలో కళాశాల రోజులు మరువలేని మధుర జ్ఞాపకమన్నారు. విద్యార్థులు లక్ష్య సాధనకు ప్రణాళికలు రూపొందించుకొని తగ్గ కృషి చేయాలని భవిష్యత్తులో కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. తోటి విద్యార్థుల పట్ల స్నేహ భావంతో మెలుగుతూ కళాశాల నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలధిరోహించాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రసాద్‌రావు, డాక్టర్ ఎం.సురేష్ బాబు, దరువురి శ్రావ్య, డాక్టర్ హరికృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీ ఇండస్ట్రీలో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న రాజీవ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు

ఎలక్ట్రికల్ వెహికిల్ ఇండస్ట్రీలో 2030 నాటికి 50మిలియన్ ఉద్యోగాలు కల్పించబడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ప్రమోషన్స్ హెడ్, ఆటో అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ సెక్టార్ లీడ్ రాజీవ్ కుమార్ వైఎస్సార్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'లేటెస్ట్ ట్రెండ్స్, ఫ్యూచర్ ప్రొస్పెక్ట్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీస్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజీవ్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనని పేర్కొన్నారు. దేశంలో రోజు రోజుకు పెరిగిపోతున్న జనాభా వలన ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం పెరిగిందన్నారు. ప్రస్తుతం ఇండస్ట్రీలకు ఎలక్ట్రిక్ వెహికల్స్‌లలో వినియోగించే టెక్నాలజీలపైన అనుభవం కలిగిన వారు తక్కువగా ఉండటం ప్రధాన సమస్యగా మారిందన్నారు. కాబట్టి విద్యార్థులందరూ ఎలక్ట్రిక్ వెహికల్స్‌లో వినియోగించే టెక్నాలజీపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ అమీర్

ఎమ్మెల్యేను కలిసిన బెల్లంకొండ నూతన ఎస్ఐ అమీర్

ప్రజాశక్తి- బెల్లంకొండ

బెల్లంకొండ పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కె. అమీర్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. బెల్లంకొండ మండలం శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా విధులు నిర్వహించాలని ఎస్సైకు ఎమ్మెల్యే సూచించారు.

జీతాలే పడలేదు..ఇదేం ఖర్మ రాష్ట్రానికి..

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

ఉద్యోగులకు జీతాలే ఇంకా అంధించలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని, రాష్ట్రానికి ఇదేం ఖర్మని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై.వి. ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని పాకాలపాడులో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలు ఆకాశాన్ని అంటిన ధరలతో అల్లాడుతున్నారని, మూడున్నరేళ్లుగా అభివృద్ధి లేదని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం కొట్టుమిట్టాడుతుందన్నారు. రైతులు, రైతు కూలీలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి లేక నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి ఆళ్ల సాంబయ్య ,మండల పార్టీ అధ్యక్షులు ఆళ్ల అమరేశ్వరరావు, టిడిపి నాయకులు కొణికినేని సత్యనారాయణ,బత్తుల నాగేశ్వరరావు , పల్నాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


మహిళలతోమాట్లాడుతున్న వై.వి ఆంజనేయులు

ఆరోగ్య మిత్రలకు కేటగిరి-1 కేటాయించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: రాష్ట్రంలోని ఆరోగ్య మిత్రలను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో కేటగిరి-1 కేటాయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని సంఘం నాయకులు శనివారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర దళిత గిరిజన ఆరోగ్య మిత్రల ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు, రాంబాబు, కిరణ్ కుమారులు మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకంలో 16 ఏళ్లుగా ఆరోగ్య మిత్రలు బాధ్యతలు నిర్వహిస్తూ ఆరోగ్యశ్రీ పథకానికి మంచి గుర్తింపు తెచ్చారని వివరించారు. వారిని కేడర్-1లో గుర్తించి ప్రమాదవశాత్తు విధుల్లో మరణిస్తే రూ.10లక్షలు పరిహారం, కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని, పదోన్నతి ఇవ్వాలని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి స్పందిస్తూ ఆరోగ్య మిత్రల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని క్యాడర్-1, లేదా 2 ఇచ్చే విషయంలో లీగల్‌గా ఎటు వంటి ఇబ్బందులు లేకుండా ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ఆరోగ్య మిత్రుల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నడింపాలెం పాఠశాలలో డిఇఓ తనిఖీ


నడిపాలెంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఇఓ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు:మండల పరిధిలోని నడింపాలెం మండల పరిషత్ పాఠశాలలో శనివారం డిఇఓ శైలజ,ఆర్‌జెడి సుబ్బారావులు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల జరుగుతుండగా బడిబయట పిల్లలు ఆడుకోవడం చూసిన డిఇఓ వారితో మాట్లాడారు. ఏ స్కూల్ అని అడుగగా ఇద్దరు అదే స్కూల్‌లో 6,7 తరగతులు చదువుతున్నామని తెలుపుగా మరొక విద్యార్థి ప్రైవేట్ పాఠశాలలను అని చెప్పారు. అనంతరం తరగతి గదిలో పిల్లల వద్ద ఉన్న టెక్స్ట్ బుక్స్‌ను పరిశీలించగా వారు చేయాల్సిన సాధన చేయకపోవడంతో ఉపాధ్యాయులపై అగ్రహం వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను ఎంఇఓ విజిట్ చేస్తున్నారా..లేదా అని ప్రశ్నించారు. 8 నెలలు గడుస్తున్నా పిల్లలకు పాఠాలు పేర్లు ఎందుకు రావడం లేదని, వర్కుబుక్ కరెక్షన్ ఎందుకు చేయడం లేదని అడిగారు. పాఠలు చెప్పని టీచర్లకు ఉద్యోగాలు అక్కరలేదని అగ్రహం వ్యక్తం చేశారు. నాడు-నేడు పనులు జరిగి స్కూల్‌లో శానిటేషన్ కూడా సరిగా చేయడం లేదని పాఠశాలలోని ఉపాధ్యాయులకు మెమోలు, ఎంఈఓ రమాదేవికి షోకాస్ నోటీజులు జారీ చేయమని అధికారలు తెలిపారు. మరలా ఒక వారంలో వస్తాను పాఠశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

విద్యార్థుల ఘర్షణ పై ఆర్జెడి, డిఇఓ విచారణ

విద్యార్థుల ఘర్షణపై శనివారం ఆర్ జె డిసుబ్బారావు, డీఈవో శైలజ చిన్న కొండ్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విచారణ చేశారు పాఠశాలల్లో విద్యార్థుల ట్యాబులు పై విద్యార్థిని విద్యార్థులను ట్యాబ్ యొక్క ఉపయోగాలు అడిగి తెలుసుకున్నారు .కొందరు విద్యార్థులు ట్యాబ్ తీసుకొని 50 రోజులైనా వాటిని సరిగా వినియోగించన కారణంగా ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న గోరు ముద్ద స్వయంగా అర్‌జెడి,డిఈఓ విద్యార్దులతో పాటు కూర్చొని కలిసి బోజనం చేశారు అనంతరం ఘర్షణకు సంబంధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుల గదికి పిలిచి విడివిడిగా విచారణ చేసి వారి వద్ద నుంచి రాతపూర్వకంగా లెటర్ తీసుకున్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు నుంచి కూడా లిఖితపూర్వకంగా లేటర్ తీసుకున్నారు.అక్కడకు వచ్చిన తల్లి తండ్రులు ఉపధ్యాయుల తిరుపై అసహనం వ్యక్తం చేశారు.

మత్స్య సంపదపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్సస్ ఇన్ ఆక్వాకల్చర్ మేనేజ్మెంట్ అండ్ ఎన్విరాన్మెంటల్ ఇష్యూష్" అనే అంశంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సమర్పణలో జాతీయ సదస్సు ముగిసింది.జాతీయ సదస్సు రెండో రోజులో భాగంగా వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన విద్యార్థులను ప్రాక్టికల్ ట్రైనింగ్ కోసం పశ్చిమగోదావరి జిల్లాలోని కొల్లేరు సరస్సు సందర్శనకు తీసుకువెళ్లారు. కొల్లేరు పరిసర ప్రాంతాల్లో రామరాజు చేపల చెరువులను సందర్శించారు. అలానే జేయస్ రాజు చేపల ప్యాకింగ్, ఐసింగ్ యూనిట్‌లను సందర్శించారు. అక్కడ చేపలను శుభ్రపరచడం, భద్రపరచడం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తర్వాత కొల్లేరు పరిసర ప్రాంతాల్లోని చేపల మార్కెట్లు సందర్శించారు. అక్కడ అనేక రకాల చేపలను పరిశీలించినట్లు తెలిపారు. ఆటపాక పక్షుల కేంద్రాన్ని సందర్శించారు. ఈ ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ కే.సునీత, ఫ్యాకల్టీ ఆఫ్ నాచురల్ సైన్సెస్ ప్రోఫెసర్ డీన్ సింహాచలం పాల్గొన్నారు.

స్పీకింగ్ ట్రీ సంస్థకు జెకెసి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు:స్పీకింగ్ ట్రీ సంస్థ జెకెసి కాలేజిలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 64 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలియజేశారు. 210 మంది విద్యార్థులు పాల్గొనగా, వివిధ దశల్లో ఎంపిక పరీక్షలు నిర్వహించి, తుది దశకు 64 మంది రూ.1.80 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్.శ్రీనివాసరావు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జె.మురళిమోహన్, పీజీ డైరెక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ వై.సురేష్‌బాబు అభినందనలు తెలిపారు.




ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి



ప్రజాశక్తి -దుగ్గిరాల : మండలంలోని చింతలపూడి గ్రామ సమీపంలో ఈ నెల 8వ తేదీ బుధవారం తెనాలి విజయవాడ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఒక వ్యక్తిని ఢీ కొట్టింది. అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. తెనాలి 108 వాహనంలో అతనిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించినట్లు ఆసుపత్రి నుండి దుగ్గిరాల పోలీసులకు సమాచారం వచ్చింది. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. మృతుడికి సుమారు 50 ఏళ్ల ఉంటాయని, వంటిపై బ్లూ వైట్ గళ్ళ షర్ట్, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాసరెడ్డి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలి తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలిని తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని వడ్డిముక్కల రోడ్డు సమీపంలోని అరటి తోటలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సమాచారం మేరకు ముసలమ్మ గేటు దాటిన తరువాత చింతలపూడి గ్రామానికి చెందిన చెన్నకేశస్వామి దేవుడి గుడి వద్ద కౌలు చేస్తున్న వీరయ్య అరటి తోటలో గుర్తుతెలియన మహిళ మృత దేహం లభ్యమైందన్నారు. ఆమె వయస్సు సుమారు 25-30 ఏళ్ల ఉంటాయని తెలిపారు మృత దేహం కుల్లిపోయి గుర్తు పట్టలేనివిధంగా ఉందని, చింతలపూడి విఆర్‌ఓ రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతురాలి సమాచారం తెలిసిన వారు రూరల్ పోలీస్టేషన్‌లో తెలపాలని ఎస్ఐ.భార్గవ్ తెలిపారు.

మైనర్ ఆత్మహత్య కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి- దుగ్గిరాల

మండలంలోని గొడవర్రు గ్రామంలో మైనర్ బాలిక ఆత్మహత్యకు కారకుడైన అదే గ్రామానికి చెందిన యువకుడు కనపాల అనిల్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేసి శనివారం తెనాలి కోర్టుకు హాజరుపరచగా జడ్జి అతనికి రిమాండు విధించారు. ఈనెల 7వ తేదీ మంగళవారం బాలిక ఆత్మహత్యకు పాల్పడినది అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. విచారణ జరిపిన దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి నిందితుడు హైదరాబాద్‌లోని సోదరుడి ఇంట్లో ఉన్నాడని తెలుసుకొని అక్కడికి వెళ్లి అరెస్టు చేసి తీసుకొచ్చారు.



రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా కాంద్రు కమల

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా శనివారం మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాంద్రు కమల మాట్లాడుతు రాష్ట్రంలోని బిసి మహిళలకు అండగా ఉంటామన్నారు. వారి సమస్యలపై ముందుండి పోరాటం చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ జాయింట్ సెక్రెటరీ యువజన అధ్యక్షుడు ఆలా శివాజీ, జిల్లా మహిళా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మాదు నాగ దుర్గ, మాదు వెంకటేశ్వరరావు, మంగళగిరి పట్టణ సెక్రెటరీ గోలి కస్తూరి, ప్రవల్లిక, నాగమణి, ప్రసన్న, శ్రావణి, నాగజ్యోతి తదితరులు కాంద్రు కమలకు అభినందనలు తెలిపారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17, అండర్-19 బాల బాలికల రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ టెన్నిస్ పోటీలు నరసరావుపేట స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టెన్నిస్ క్రీడకు శారీరక దృఢత్వం అవసరమని అన్నారు. క్రీడలు శారీరక,మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయని చెప్పారు. క్రీడల్లో బాగా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి టోర్నమెంట్ చీఫ్ అబ్జర్వర్ శివకృష్ణ,అబ్జర్వర్లు పినాకపాణి, లక్ష్మీపతి, పుడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం పాలక మండలి సభ్యులు సురేంద్ర, మహాత్మా గాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, బి. శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ షేక్ సుభాని,మాజీ కౌన్సిలర్ ఎం. మోహన్, ఎం.కొండ,తిపరయ్య, జి. శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బెల్లంకొండ నూతన ఎస్సైకు సన్మానం

ప్రజాశక్తి-బెల్లంకొండ



మండలంలో శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని బెల్లంకొండ ఎస్సి నాయకులు దుగ్గి నాగేశ్వరరావు, గడ్డిపర్తి చినబాబు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా శనివారం బెల్లంకొండ నూతన ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన షేక్ అమీర్‌ను వారు మర్యాద పూర్వకంగా కలశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అం దించి శాలువాతో సత్కరించారు. ఎస్సై అమీర్ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, పేకాట, తెలంగాణా మద్యం, నిషేధిత గుట్కాల అమ్మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్రం కక్షపూరిత వైఖరి తగదు

- బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం
- ఎపిలో ఏ రంగానికీ కేటాయింపులు లేవు
- దీనిపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలి: సిఐటియు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

కేంద్ర బడ్జెట్- 2023 కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్‌పై అవగాహన, రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రప్రభుత్వమే పోలవరం ప్రాజెక్టును నిర్మించాల్సి ఉన్నప్పటికి బడ్జెట్‌లో దీని ఊసే లేదని, గతంలో తాము ఇచ్చిన వాటికి లెక్కలు చెప్పండి అంటూ తప్పించుకుందని విమర్శించారు. విశాఖ ఉక్కు కర్మాగారం, విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలో నిర్మించాల్సిన యూనివర్శిటీల గురించి ప్రస్తావించిన ఆయన, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు, విశాఖ రైల్వేజోన్‌కు అవసరమైన నిధులు కేటాయించలేదని అన్నారు. శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు లక్షరూపాయలు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎపిలో ఏ రంగానికి కూడా కేటాయింపులు లేక పోవడం చూస్తుంటే రాష్ట్రంపై కేంద్రం కక్షపూరిత వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కక్ష పూరిత వైఖరిపై ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.4 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయకపోవడంపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు మాట్లాడకపోవడం విచారకరమన్నారు. విభజన చట్టంలోని అంశాలలో గానీ , ప్రత్యేక హోదా ప్రకారం రావాల్సిన కేటాయింపుల గురించిన ఊసే



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్

లేకపోవడం అత్యంత బాధాకరమన్నారు. దేశప్రజల అభివృద్ధి కోరుకుంటున్నానంటున్న ప్రధాని మోడీ ఈ దేశంలో 13 శాతంగా ఉన్న ఎస్సీలకు కేవలం 3 శాతం మాత్రమే కేటాయించడాన్ని చూస్తుంటే బిజెపికి వారి పట్ల ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని విమర్శించారు. ఆదాని వ్యవహారంపై కనీసం పార్ల మెం టులో చర్చకు కూడా అవకాశం ఇవ్వక పోవడం చూస్తే పేదప్రజల అభివృద్ధి కంటే బడా పెట్టుబడిదారులకే ప్రాధాన్య మివ్వ డం ఈ దేశ దౌర్భాగ్యమన్నారు. ఒకవైపు రాష్ట్రాలు వాటి ఇష్టానుసారం అప్పులు చేస్తున్నాయంటున్న కేంద్రం మాత్రం బడా బాబుల కోసం ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని మండిపడ్డారు.

ఏప్రిల్ 5వ తేదీన అన్ని సంఘాలు ఢిల్లీలో పార్లమెంటుభవన్ వద్ద నిర్వహిస్తున్న ప్రజా గర్జన కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం బడ్జెట్ పై వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఘాటు విమర్శలు చేశారు. కార్యక్రమంలో సిఐటి నాయకులు హరిపోతురాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివదుర్గారావు, ఐద్వా నాయకులు జి.ఉమశ్రీ, డి.విమల, ఆర్.పురుషోత్తం,ఎ.వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు .

బిజెపి ఎంపి వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

- సతీసహగమనం కొనసాగించాలన్న వ్యాఖ్యలపై ఐద్వా పల్నాడు జిల్లా కమిటీ ఖండన

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సతీసహగమనం కొనసాగించాలని, సతీ సహగమనం ఆచరిస్తే మహిళలు పుణ్య లోకా లకు వెళతారని బిజెపి ఎంపి చంద్రపాల్ జోషి వ్యాఖ్యలను అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పల్నాడు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం స్థానిక పుతుంబాక భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమాశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపి చంద్ర పాల్ జోషి ఇటీవల పార్లమెంటు ఆవరణలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేయడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. భర్త మరణిస్తే భార్యను కూడా చితి మంటల్లో సజీవ దహనం చేసే సతీసహగమనం అనే నాటి దురాచారంపై సంఘసంస్కర్తలు, మహిళాలోకం చేసిన వీరోచిత పోరాటం ఫలి తంగా దీనిని రూపుమాపడం జరిగిందని అన్నారు. ఏనాడో రూపుమాపిన ఈ దురా చారాన్ని మళ్లీ ఆచరించాలని అనడం దుర్మా ర్గమైన చర్యగా అభివర్ణించారు.



ఒక వైపు దేశం ముందుకు పోతోందని చెబుతున్న బిజెపి, ఏనాడో రూపుమాపిన దురాచారాలను మళ్లీ ముందుకు తీసుకురావడమంటే ఈ దేశాన్ని వెనక్కి తీసుకుపోతున్నారనడానికి ఈ వ్యాఖ్యలే ఉదాహరణ అని అన్నారు. ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని మాట్లాడుతూ బిజెపి ఎంపి తన వ్యాఖ్యలను ఉప సంహరించు కోవా లని, మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా నాయకులు గుం టూరు మల్లేశ్వరి, మునగా జ్యోతి, కట్ట రమాదేవి, షేక్ అయేషా, నాగమ్మలు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయిలో ఎడ్ల పందేలు

ప్రజాశక్తి -రెంటచింతల

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సత్రశాలలో భక్త మల్లారెడ్డి అన్నదాన సత్రంలో ఆదివారం నుంచి ఆరు రోజులపాటు ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘ అధ్యక్షుడు పులి ఓబుల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆరు విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని, అన్ని విభాగాల్లో కలిపి మొత్తం రూ.11 లక్షల బహుమతులు అందజేస్తామన్నారు. నాలుగు చర్నకోలాలు మాత్రమే వాడాలని, ఒక సైజులో పాల్గొన్న జత మరొక సైజులో పాల్గొనడానికి వీలు లేదని, ప్రదర్శనలో ఒక్కొక్క జతకు ఏడుగురు మాత్రమే సారథులు ఉండాలని, తెల్లటి దుస్తులు మాత్రమే ధరించాలని, కాడి విరిగినా, గొలుసులు తెగినా అదనపు సమయం ఇచ్చే అవకాశం లేదని నిబంధనల గురించి వివరించారు. వరుసగా నాలుగేళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సుప్రీం విచారణపై పెరుగుతున్న ఉత్కంఠ

వీక్షణం

సిఆర్‌డిఏ చట్టం రద్దు చేయాలన్న నిర్ణయం చెల్లదని,రాజధాని మార్పు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని గత ఏడాది మార్చిలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. ఈ కేసు ఈనెల 23న విచారణకు రానుంది. ఈ అంశంపై రైతులు, కేంద్ర ప్రభుత్వ వాదలను అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టు స్వీకరిస్తోంది. ఈ కేసును త్వరితగతిన విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. రైతుల తరుపున అఫిడవిట్‌లను దాఖలుకు తగిన సమయం కావాలని రైతుల తరుపున న్యాయవాదులు కోరారు. దీంతో ఈ కేసును గత నెల 31వ తేదీన విచారించాల్సి ఉండగా తిరిగి ఈనెల 23కి వాయిదా వేశారు. ఈనెల 23 నుంచి విచారణ షెడ్యూలును ప్రకటించ నున్నారు. అలాగే గత మార్చిలో రాజధాని అభివృద్ధిపై కాలపరిమితి విధిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై గతేడాది నవంబరు 28న సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు ఇచ్చిన తీర్పులో కొన్ని అంశాలపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంపై రాజధానిలో రైతులు కొంత నిరాశకు గురయ్యారు. ప్రధానంగా రాజధానిలో అభివృద్ధి పనులకు సంబంధించి హైకోర్టు నిర్దేశిత కాలపరిమితిని విధించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అంతేగాకుండా అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకరించాలా అని ప్రశ్నించింది. కాలపరిమితి లేకపోతే తమ పరిస్థితి ఏమిటన్నదీ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే తమకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఎప్పటికి దక్కుతాయన్నదీ రైతులు తీవ్ర గందరగోళంలో ఉన్నారు. రాజధానిని అభివృద్ధి చేయకపోతే తమ ప్లాట్‌లకు ధరలు ఎలా వస్తాయన్నదీ రైతులను వేధిస్తున్న ప్రశ్న. రాజధానికి భూములు ఇస్తే మీకు ఎంతో మేలు జరుగుతుందని గత ప్రభుత్వం రైతులకు ఆశపెట్టింది. 2015లో భూములు తీసుకున్న అప్పటి ప్రభుత్వం 2018 నాటికి అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాల్సి ఉంది. గత ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్లాట్‌లను రైతులకు అప్పగించలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రైతులకు ప్లాట్‌ల అప్పగింతపై దృష్టి సారించలేదు. రాజధాని భూ సమీకరణలో భూములు ఇచ్చిన దాదాపు 24 వేల మంది రైతులతో పాటు 29 గ్రామాల పరిధిలో భూములు కొని పెట్టుబడి పెట్టిన వేలాది మంది ప్రజలు తీవ్ర గందరగోళంలో ఉన్నారు. గత ప్రభుత్వ హయంలో రైతుల వద్ద భూములు కొని సమీకరణలో ఇచ్చిన వారు తాము నిండా మునిగిపోయామని వాపోతున్నారు. 2019 డిసెంబరు 17న శాసనసభలో సిఎం జగన్ మూడు రాజధానుల ప్రకటనతో 29 గ్రామాల్లో లావాదేవీలు మందగించాయి. 2019 డిసెంబరు 18 నుంచి ఉద్యమానికి అమరావతి ఐక్య కార్యచరణ సమితీ పిలుపునిచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు విరామం లేకుండా రైతులు తమ ఆందోళనను వివిధ రూపాల్లోకొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్ దాటవేత వైఖరి ప్రదర్శించినట్టు స్పష్టం అయింది. ఈ అఫిడవిట్‌లో సమయం వచ్చినప్పుడు చెబుతామని, రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని అస్పష్టమైన వైఖరిని ప్రదర్శించింది. రైతులు సంయమనంతో వ్యవహరిం చాలని, ప్రస్తుతానికి వేచిచూసే ధోరణితో ఉండాలని జెఎసి నాయకులు సూచించారు. గత మూడేళ్లుగా ఉద్యమం చేస్తున్న రైతులు ప్రస్తుతం తమ ఉద్యమం కొనసాగిస్తూనే సుప్రీం కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈనెల 23 నుంచి జరిగే విచారణలో అభివృద్ధి చేసిన ప్లాట్‌ల అప్పగింతపై సుప్రీంకోర్టులో రైతుల తరుపున వాదించేందుకు పలువురు న్యాయవాదులు సిద్ధం అవుతున్నారు. ఈనేపథ్యంలో సుప్రీంకోర్టులో విచారణ, తదనంతరం వెలువడే తీర్పుపై రాజకీయ పక్షాలతో ఆసక్తి నెలకొంది.

ఎవిడి శర్మ

శ్రీశ్రీ స్ఫూర్తిగా రచనలకు పదును పెట్టాలి

ఆకట్టుకున్న తెలుగు సాహిత్యం, తెలుగభాష గమనం, గమ్యంపై ప్రసంగాలు

అట్టహాసంగా ప్రారంభమైన అరసం రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-తెనాలి : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 19వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో అరసం రాష్ట్ర అద్యక్షులు రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో తొలుత అరసం పతాకాన్ని గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రారంభించారు. అరసం అఖిలభారత ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ సింగ్ సిర్సా ప్రారంభోన్యాసం చేయగా ముఖ్య వక్తగా పాల్గొన్న సుప్రసిద్ధ అభ్యుదయ కవి డాక్టర్ కత్తి పద్మారావు ప్రసంగిచారు. సభలో అరసం జాతీయ నేత ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ గొప్ప నినాదమే గొప్పకవిత్వమన్నారు. తెలుగు భాష సంస్కరణలో గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, కందుకూరి వీరేశలింగం పతులును ప్రధానంగా చెప్పవచ్చున్నారు. సాహిత్యం విమర్శ అభ్యుదయ పత్రికలో ప్రచురించే వారని, అరసం నిర్వహించిన అభ్యుదయ పత్రిక అద్భుతమైన రచయితలను సమాజానికి పరిచయం చేసిందన్నారు. మహాసభల ఆహ్వానసంఘం అద్యక్షులు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ 1943లో తాపీ ధర్మారావు అధ్యక్షతన అరసం ఏర్పడిందని, 80 ఏళ్ళ ప్రస్థానాన్ని కొనసాగించిందన్నారు. డాక్టర్ పి.సంజీవమ్మ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అభ్యుదయ రచనలు రావాలన్నారు. అఖిల భారత అరసం కార్యదర్శి వినీత్ తివారి మాట్లాడుతూ అరసం ముందు అనేక సవాళ్లున్నాయన్నారు. 80 సంవత్సరాల అరసం అనుభవాలతో ఆ సవాళ్లను అధికమించాలన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన సంఘం కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు రచించిన అమరావతి మిర్రర్ సంచికను అరసం కార్యవర్గ సభ్యుల ఓబులేసు ఆవిష్కరించారు. అలాగే అరసం కథాస్రవంతి సంచికను అరసం అఖిరభారత ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ సిర్సా అవిష్కరించారు.


తెనాలి పట్టణంలో అరసం పాదయాత్ర

తెలుగు సాహిత్యం దశ..దిశా...

మహాసభల్లో తెలుగు సాహిత్యం దశ దిశ అంశపై అరసం రాష్ట్ర కార్యదర్శి జివిస్ చలం అద్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి రచయితకు సామాజిక స్పృహ ఉండాలన్నారు. ఏ రచనైనా సులభశైలిలో ఉండాలని, పాఠకులను హత్తుకునే రీతిలో ఉండాలన్నారు. అదే సమయంలో విమర్శ కూడా ఉండాలని, అది కూడా చాలా సున్నితంగా ఉండాలన్నారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి మేడేపల్లి రవికుమార్ మాట్లాడుతూ సాహిత్యం ఓ ప్రవాహం వంటిదన్నారు. శ్రీశ్రీ రచనలు ప్రజల గుండెలను హత్తుకున్నాయన్నారు. ఒక దశలో శ్రీశ్రీ ఇల్లు వేలం వేస్తున్నారంటే ఎంతో మంది అభ్యుదయవాదులు దానిని అడ్డుకుని ఆర్థికంగా సహకరించిన పరిస్థితిని గుర్తు చేశారు. ప్రస్తుతం రచయితలకు ఆ ఆదరణ లేదని, శ్రీశ్రీని స్ఫూర్తిగా తీసుకుని రచనలకు పదును పెట్టాలన్నారు. కుప్పం ద్రవిడియన్ విశ్వ విద్యాలయం తెలుగు విభాగాధిపతి కె.శ్రీదేవి మట్లాడుతూ తెలుగు సాహిత్యం అనేక రకాలుగా పరిణితి చెందిందన్నారు.



మాట్లాడుతున్న సత్యాజి

తెలుగునాట.. తెలుగు భాష.. గమనం.. గమ్యం

తెలుగునాట తెలుగు భాష గమనం, గమ్యం అంశంపై యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్ ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య వక్తలుగా పాల్గొన్న వారిలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ ప్రపంచమంతా ఆమోదించిన సత్యం మాతృభాషన్నారు. కోర్టు తీర్పులు, వాదనలు అన్నీ కూడా తెలుగులో ఉండాలని తీర్మానించినా అమలు చేసే పరిస్థితి లేదన్నారు. తెలుగు భాషే అవసరం లేదన్న భావనలో ప్రభుత్వం ఉండటం బాధాకరమన్నారు. పట్టుబడిదారి విధానం, పెత్తందారీ పోకడలు, రాజకీయ పరిణామాలు భాషపై ప్రభావం చూపుతున్నాయన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న ఉద్యోగులు సైతం తెలుగు సాహిత్యంపై రచనలు చేస్తున్న తరుణంలో ఇంగ్లీష్ మీడియం పేరిట తెలుగు భాష ప్రాధాన్యతను దిగజార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసాహితీ పత్రిక దివికుమార్ మాట్లాడుతూ జాతి సంస్కృతికి జీవ గర్ర భాషన్నారు. భాష అంతరిస్తే జాతి అంతరిస్తుందన్నారు. భాష, సంస్కృతి పరిరక్షణ దిశగా రచనలు రావాలన్నారు. అరసం సభ్యులు సాకం నాగరాజు, యువశ్రీ మురళి ప్రసంగించారు. అనంతరం మహాసభల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. సభానంతరం సభా వేదిక నుంచి బోస్ రోడ్డు, గాంధీ చౌక్, శివాజి చౌక్ మీదుగా ప్రజానాట్యమండలి కాళాకారుడు గని ఆధ్వర్యంలో పాటలు పాడుతూ పాదయాత్ర చేశారు.

పురాతన చిత్రకళ పై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి : మాంటిస్సోరి పాఠశాల పూర్వ విద్యార్థిని, సాఫ్ట్ వేర్ ఉద్యోగిని వేజళ్ల నవ్య సెలవు దినాల్లో విద్యార్థుల్లో సజనాత్మకతను పెంపొందించేందుకు మహారాష్ట్రలోని వర్లి ట్రైబల్‌కు చెందిన పురాతన చిత్ర కళపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తేలికగా సరళ రేఖలు, వృత్తాలు , చతురస్రాలు, జ్యామితి చిత్రాలతో వ్యవసాయ వృత్తులు, ఆచార వ్యవహారాలు, మన దినచర్యలో చేసే పనులు చిత్రాలు గీసే విధానాన్ని నేర్పించారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ ముఖ్యంగా వర్లీ తెగవారు మాఘ మాసములో వివాహాది శుభకార్యాలు, వైశాఖ మాసంలో వ్యవసాయ పనులు చేపట్టే సమయంలో తప్పని సరిగా వర్లీ చిత్రాలను రూపొందించేవారన్నారు. పూర్వీకుల కళను చిన్నారులకు ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించి నేర్పిస్తున్నట్లు చెప్పారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ విద్యార్థులకు గణితములో జామితి చిత్రాలను గీసే విధానాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే నవ్యను అభినందించగా, ఉపాధ్యాయ బృందము జ్ఞాపికను బహుకరించారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, శారద, శిరీష, కృష్ణవేణి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉమామహేశ్వర్ నవ్య తదితరులు

ఘనంగా ముగిసిన ఆర్‌విఆర్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు : అద్భుతాలు సృష్టించే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థుల ఆలోచనలు వుండాలని టిసిఎస్ వైస్ ప్రెసిడెంట్ అండ్ ఎఎంపి గ్లోబల్ ఆర్ఎమ్‌జి హెడ్ ఈ.ఎస్.చక్రవర్తి పేర్కొన్నారు. రెండ్రోజులపాటు నిర్వహించిన ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి వార్షికోత్సవ వేడుకలు శనివారం సాంస్కృతిక, జానపద నృత్య ప్రదర్శనలు, గ్రూప్, సోలో వెస్ట్రన్ డ్యాన్స్, మిమిక్రీ, సినీగీతాలాపనలు, విద్యార్థుల కేరింతల మధ్య ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ.ఎస్.చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమాచార నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ ప్రాంతీయ భాషలతోపాటుగా ఇతర భాషలలో పట్టు సాధించినప్పుడే విజయ అవకాశాలు త్వరితగతిన చేరువవుతాయన్నారు. తమ చుట్టూ వున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రతి ఇంజినీరింగ్ విద్యార్థి సిద్ధంగా ఉండాలని సూచించారు. కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ప్రతి సంవత్సరం సాధించిన ఫలితాల వార్షిక నివేదికను వివరించి, ఉన్నత విద్యా, ప్రమాణాలు కలిగిన అధ్యాపక బృందం, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందించడం ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రుల ఆశల మేరకు విద్యార్థి ఉజ్వల భవిష్యత్తే తమ లక్ష్యమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ పేర్కొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధన దిశగా చదువులో రాణిస్తూ భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా నడవాలని ఆయన అన్నారు. తెలుగు చలనచిత్ర నవహీరో, కళాశాల పూర్వ విద్యార్థి కాకాని ధర్మ మహేష్ మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల్లో ఉత్తమ ఫాలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సర్టిఫికెట్లను, మెమొంటోలను అతిథుల చేతులమీదుగా అందజేశారు.సి.ఎస్.బి.ఎస్ విభాగానికి సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లాశ్రీనివాస్, విభాగాధిపతి డాక్టర్ ఎమ్.వి.పి. చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళి మోహన్, పాలకమండలి సభ్యులు పి.గోపిచంద్, రంగారావు, కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాస రావు పాల్గొన్నారు.






మాట్లాడుతున్న పి మధు

మూఢవిశ్వాసాల నిరోధక చట్టం చేయాలి

నిడమర్రులో ప్రారంభమైన నాస్తిక మేళా

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం నిడమర్రులో చార్వాక ఆశ్రమంలో 31వ రాష్ట్ర నాస్తిక మేళాను శనివారం ప్రారంభించారు. నాస్తిక సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మేళాలో మొదటిరోజు నాస్తికత్వం జీవన విధానం అనే అంశంపై ఫిరా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేష్ ఘోడరావ్ మాట్లాడారు. సరళీకత ఆర్థిక విధానాలు- పర్యవసానాలు అనే అంశంపై టి లక్ష్మీనారాయణ ఉపన్యసించారు. మహిళలు మతతత్వం అనే అంశంపై కవి రచయిత్రి విమల మాట్లాడారు. హేతువాదులు మానవ సంబంధాలు అనే అంశంపై సైన్స్ హేతువాదం మాసపత్రిక సహాయ సంపాదకులు సమతా శ్రీధర్, జాతీయ విద్యా విధానంపై ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్, ముంచుకొస్తున్న ఫాసిస్ట్ ప్రమాదం మన కర్తవ్యాలు అనే అంశంపై విప్లవ రచయితల సంఘం నేత సి ఎస్ ఆర్ ప్రసాద్ ప్రసంగించారు. ఖగోళ విజ్ఞానంపై ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్ శ్రీ రఘునందన్ కుమార్, నాస్తిక వాద కార్యాచరణ వారి అనుభవాలు అనే అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ పి మధు మాట్లాడుతు దేశంలో మూఢాచారాలను పెంచే దిశగా మతతత్వ శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని, మూఢాచారాలకు వ్యతిరేకంగా మొదటి నుండి కమ్యూనిస్టులు, నాస్తిక వాదులు పోరాటం చేస్తూనే ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం బిజెపి ఆర్ఎస్ఎస్ తమ భావజాలాన్ని మరింత ప్రమాదంగా పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు. నేడు ఉద్యమాలకు అనేక సమస్యలను ఎదురవుతున్నాయని వాటిని నాస్తిక వాదులు, కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు, తదితరులు ఐక్యమై ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రత్యామ్నాయ సంస్కృతి కావాలని అభ్యుదయ భావజా లాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డాక్టర్ ముసాబిన్, బిందేష్ తదితరులు

భాష్యంలో స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి-గుంటూరు : విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించటానికి భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో గుంటూరు స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించటం అభినందనీ యమని డాక్టర్ షేక్.ముసాబిన్ అన్నారు. శనివారం స్థానిక గోరంట్ల భాష్యం రామసేతు క్యాంపస్ గ్రౌండ్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆటలో గెలుపోటములు సహజమని వాటిని సమన్వయం చేసుకుంటూ ముందువెళ్లిన వారే ఉన్నత శిఖరాలు చేరుకొని విజేతలుగా నిలుస్తారన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో దృఢనిశ్చయాన్ని ఏర్పరు చుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ బి.బిందేష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. తొలుత అతిథులు స్పోర్ట్స్‌మీట్ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, క్రీడాజ్యోతిని వెలిగించి శాంతికి చిహ్నమైన పావురాలను ఎగురవేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు తల్లిదండ్రులకు, అతిథులకు భాష్యం ఛైర్మన్ భాష్యం రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో భాష్యం అర్బన్ జెడ్ఈఓ స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

- వినుకొండలో 100 కేసులు రాజీ
- మాచర్లలో 300, సత్తెనపల్లిలో 661, పిడుగురాళ్లలో 67 కేసుల పరిష్కారం


వినుకొండలో..

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎ. తౌషీద్ హుస్సేన్ శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ లో రాజీ పడిన బ్యాంకు కేసులు, ప్రామిసరీ నోట్, చెక్ బౌన్స్ , మనోవర్తి, భార్యా భర్త తగాదాలు, గృహహింస, విడాకులు, తగాదాలు, ప్రైవేట్ కంప్లైంట్స్, ప్రిలిటిగేషన్ కేసులు,పెట్టి కేసులు, ఇతర కేసులు 100 రాజీ పరిష్కారం చేసి 91,80, 519 లక్షలు పరిహారం కక్షి దారులకు ఇప్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి వుండాలని, చిన్న చిన్న తగాదాలకు పోలీస్ స్టేషన్ల చుట్టూ,కోర్టుల చుట్టూ తిరిగి తమ విలువైన సమయాన్ని కోల్పోవద్దని, రాజీ మార్గమే రాజ మార్గమని తెలిపారు. సమస్యలను సామరస్యముగా రాజీ పద్ధతులలో పరిష్క రించుకోవాలని, వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే, ఎస్‌టి, ఎస్‌సి కేసులు సుమారు 402 కేసులు కూడా లోక్ అదాలత్ లో పరిష్కరించినట్లు తెలిపారు. సీనియర్,జూనియర్ న్యాయవాదులు, వినుకొండ పట్టణ, రూరల్ పోలీ సులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మాచర్ల

స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ ఆదాలత్‌లో భాగంగా నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో 300 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తులు సిహెచ్ మధుబాబు, ఎన్ శారదలు తెలిపారు. శనివారం న్యాయమూర్తులు సిహెచ్ మధుబాబు, ఎన్ శారదల అధ్యక్షతన నిర్వహించిన బెంచ్‌లలో సివిల్ కేసులు 23, క్రిమినల్ కేసులు 56, చెక్ బౌన్స్ కేసులు 5, భరణం కేసులు 3, నేరం అంగీకరించిన కేసులు 203, ముందస్తు రాజీ కేసులు 10తో మొత్తం 300 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు సిహెచ్ మధుబాబు, ఎన్ శారదలు మాట్లాడుతూ రాజీ రాచమార్గమన్నారు. పరిష్కారం అయిన 300 కేసుల విలువ రూ 1 కోటి 32 లక్షల 31 వేల 33 రూపాయలుగా వివరించారు. న్యాయవాదులు షేక్ గౌస్‌పాషా, రమావత్ రాంనాయక్, జూపల్లి శ్రీనివాసరావు, గట్లా సత్యనారాయణరెడ్డి, ఎ.బాలజోజి, గంగుల శ్రీనివాసరావు, పేర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

జాతీయ లోక్ అదాలత్ కు అనూహ్య స్పందన లభించింది. సత్తెనపల్లిలోని నాలుగు న్యాయస్థానాల పరిధిలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ లో 661 కేసులు పరిష్కారమయ్యాయి. మూడు బెంచ్‌లుగా లోక్ అదాలత్ నిర్వహించారు. రూ.65,25,783 లక్షల నగదు లావాదేవీలు పరిష్కారమయ్యాయి. మొదటి బెంచ్ కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి డి. నాగ వెంకటలక్ష్మి, మెంబర్‌గా న్యాయవాది నల్లిబోయిన ఆంజనేయులు వ్యవహరించారు.

రెండవ బెంచ్ కు న్యాయ మూర్తిగా కడియాల ప్రశాంతి ఇన్‌ఛార్జి (ఎఫ్.ఎ .సి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి , సత్తెనపల్లి1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి), బెంచ్ కు మెంబర్ గా న్యాయవాది బి.లక్ష్మీకోటేశ్వరరావు లు వ్యవ హరించారు. మూడవ బెంచ్ కు సత్తెనపల్లి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహ మ్మద్ గౌస్ న్యాయమూర్తిగా, లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాది ఆకుల నాగార్జున వ్యవ హరించారు. బార్ అధ్యక్షులు మారురి లింగారెడ్డి , పలువురు న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

పట్టణంలోని కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ చైర్మన్ మురళి గంగాధర రావు మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకొని సమయాన్ని, డబ్బును ఆదాసేసుకోవచ్చని, రాజీ పడితే ఇరువర్గాలు గెలిచినట్లుగా పేర్కొన్నారు. తనంతరం జరిగిన లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 2, మనోవర్తి కేసులు 4 కేసులకు గాను రూ.18 లక్షలు, గృహహింస కేసులు 2,చెక్ బౌన్స్ కేసు 1 కేసులో రూ. 158 వేలు, సివిల్ దావాలు రూ.6.60000-వేల రూపాయలు కక్షి దారులకు చెల్లించారు. రాజీమార్గంలో కక్షిదారులు మొత్తం రూ.26,18,000 చెల్లింపులు జరిగినట్లు తెలిపారు.క్రిమినల్ కేసులు 58 , ఎస్ టి సి కేసులు 147 పరిష్కరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్, లోక్ అదాలత్ నెంబర్ గణపతినీడి రమేష్ , సెక్రటరీ వెంకటేశ్వర్లు సీనియర్ న్యాయవాదులు దారా చెన్నయ్య , కంభంపాటి కోటేశ్వరరావు, కె రామిరెడ్డి, ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




సమావేశం లో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ

రౌడీయిజం చేసే వారి వివరాలు చెప్పండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో రౌడీయిజం చేసే వారి వివరాలు తెలియజేయాలనీ సత్తెనపల్లి డిఎస్పీ బి ఆదినారాయణ మహిళా పోలీసులను ఆదేశించారు. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలో మహిళా పోలీసులు గ్రామ వాలంటీర్లతో డీఎస్పీ ఆదినారాయణ శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలు ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పేకాట, అక్రమ మద్యం విక్రయించే వారి వివరాలు తెలియపరచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రూరల్ సిఐ రామిశెట్టి ఉమేష్ రూరల్ ఎస్సై ఆవుల బాలకృష్ణ పాల్గొన్నారు.



సమాజ సేవకులు విన్సెంట్ పాల్ కు సన్మానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణానికి చెందిన ప్రముఖ సమాజ సేవకులు చుక్కా విన్సెంట్ పాల్ మ్యాజిక్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హర్యానాకు చెందిన సంస్థ నుంచి గౌరవ డాక్టరేట్ పొందిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న పలు కళా సంస్థలు శనివారం ఆయనను ఘనంగా సన్మానించాయి. పలువురు అభినందించారు. విన్సెంట్ పాల్ ఇంకా సేవా కార్యక్రమాలు చేస్తూ మరిన్ని అవార్డులు తీసుకోవాలని ఆకాంక్షించారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యులు ఎవి శివయ్య, చిలకలూరిపేట కళాతోర ణం వ్యవస్థాపకులు ఎం.వెంకటేశ్వర్లు, కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్‌కె సలీం, ఘంటసాల గానసుధా కార్యదర్శి బి. వెంకట కోటయ్య, కంచర్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బసవయ్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-ఈపూరు



మండలంలోని ఇనిమెల్ల లో మాజీ సర్పంచ్ పాలగాని బసవయ్య విగ్రహాన్ని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే జీవి ఆంజ నేయులు శనివారం ఆవిష్కరిం చారు. అనంతరం పుల్లారావు, ఆంజనేయులు మాట్లాడుతూ ఇనిమెల్ల గ్రామ అభివద్ధిలో సర్పంచ్ గా పాలగాని బసవయ్య పాత్ర ఎనలేనిదన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకత్వాన్ని ముందుండి నడపడంలో ఎంతగానో శ్రమించారన్నారు. పాలగాని బసవయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై పుల్లారావు ఆరోపణలు చేశారు. ఇసుక, మద్యం, మైనింగ్‌లతో దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టి నమ్మించి ఓట్లు వేసిన తర్వాత ప్రజా సమస్యలు పట్టించుకోని జగన్ అక్రమార్జనపై దృష్టి సారించారని ఆరోపించారు. రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల మాజీ చైర్మన్ జి.కోటేశ్వరరావు, పల్నాడు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జగ్గారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెంకయ్య, టిడిపి మండలాధ్యక్షుడు టి.బాలయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి

విద్యతో ఉన్నత స్థానం

ప్రజాశక్తి-మాచర్ల

విద్య ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని, తద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చునని ప్రభుత్వ విప్, ఎం.ఎల్.ఎ పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. స్థానిక కృష్ణవేణి జూనియర్ కాలేజి ఫేర్‌వల్ ఫంక్షన్ స్థానిక నరిశెట్టి కళ్యాణ మండపంలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లా డుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడ విద్యకు పెద్దపీట వేసిందన్నారు. విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన తదితర స్కీమ్‌లతో పేద విద్యార్థుల చదువులకు ఎలాంటి అటంకం లేకుండా సాగేందుకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు వివరించారు. మరో ముఖ్యఅతిథి మున్సిపల్ చైర్మన్ బోయ రఘు రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణులైతే వారి తలిదండ్రులకు, ఆయా పాఠశాలలు, కాలేజీలకు కీర్తి, ప్రతిష్టలు తీసుకొచ్చినట్లు అని అన్నారు మోటివేటర్ వేణు కళ్యాణ్ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే ప్రసంగం చేశారు. ప్రిన్సిపాల్ వెంకటరామయ్య, సుబ్బారావు, లక్ష్మయ్య, శ్రీనివాసరావు,వేణు, దుర్గంపూడి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 'తిరుమల ఇంజనీరింగ్' విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు జొన్నలగడ్డ పరిధిలో ఉన్న తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటి రంగంలో ప్రముఖ ధరణి ఇన్ఫోటెక్ టెక్నాలజీస్ కంపెనీ ఈ నెల 1న నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో వివిధ బ్రాంచ్ లకు చెందిన 210 మంది విద్యార్థులు పాల్గొనగా, రాత, నిర్దేశక పరీక్షలలో 22 మంది అర్హత సాధించారని, ఈ నెల 3 న గుంటూరు లోని కంపెనీలో టెక్నికల్ ,హెచ్.ఆర్ విభాగాలలో నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు రూ.3 లక్షల నుండి రూ.4 లక్షల వార్షిక వేతనం కంపెనీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తమ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సంబంధించిన ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నందువల్లు బహుళ జాతి కంపెనీలలో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు.ఉద్యోగాలు సాధించిన విద్యా ర్థులను కళాశాల చైర్మన్ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, కళాశాల సెక్రటరీ , కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల వైస్ చైర్మన్ బి.నాగేశ్వరరావు, కోశాధికారి డి.బ్రహ్మానందం అభినందించారు. ఉద్యోగాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎం. సాంబ శివరావు, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ అధికారి ఎం.శ్రీకాంత్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వై.వి నారాయణ

రెంటచింతల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి -రెంటచింతల


అధ్యక్షులు రాజ్‌కుమార్


కార్యదర్శి షేక్ అన్వర్

మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్ను కున్నారు అధ్యక్షులుగా జాన్ విజయ్ రాజ్‌కుమార్, కార్య దర్శిగా షేక్ అన్వర్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ఎంబి చిన్నమ్మ,, జి.లింగా రెడ్డి, సహాధ్యక్షులుగా ఓర్సు సాగర్‌బాబు, ఎన్‌వి వసంతకుమారి, కోశాధికారిగా జి.రామా చారి, మహిళా కార్యదర్శిగా ఎ.మేరీ జోత్స్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

ములకలూరులో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి-నూజెండ్ల : మండలంలోని ములకలూరులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యాధికారి జీవి పుష్పేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు.

పోషక విలువలు పప్పుధాన్యాలు

ప్రజాశక్తి-పెదకూరపాడు: పోషక విలువలు పప్పు దాన్యాల్లో ఎక్కువగా ఉంటాయని స్థానిక సెయింట్ ఆన్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి అన్నారు. శనివారం ప్రపంచ పప్పుల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని యూనియన్ బ్యాంకు వద్ద ఆదివారం ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెపటైటిస్ బి, సి సంబంధించి ఉచితంగా రక్త పరీక్షలు చేయనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ అధ్యక్షులు పేరం చెన్నారెడ్డి తెలిపారు వ్యాధి నిర్ధారణ అయితే గుంటూరులో ఉచితంగా మందులు ఇప్పిస్తామన్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

గుంటూరు ,మంగళగిరి, పొన్నూరు లోక్ అదాలత్‌లో 6,543 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్
జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయసేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్ వైవిఎస్‌బిజి పార్థసారధి ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సుతో జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యావంతులు లోక్‌అదాలత్‌ను చక్కగా వినియోగించుకుంటున్నారని, అలాగే తోటి నిరక్షరాస్యులకు కూడా లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో పాల్గొన్న న్యాయ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ లా విద్యార్థులు సేవాభావంతో బాధితులకు అండగా నిలబడి, మంచి న్యాయవాదులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా న్యాయసేవాధికార సంస్థల ద్వారా జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 445, క్రిమినల్ కేసులు 5349, ప్రీలిటిగేషన్ కేసులు 123, మొత్తం 5917 కేసులు పరిష్కరించారు. లోక్ అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయవాదులకు, పోలీసు సిబ్బందికి, ప్రభుత్వ సంస్థలకు, కక్షిదారులకు, న్యాయస్థాన సిబ్బందికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

మంగళగిరి:రాజీమార్గమే రాజమార్గమని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి డి శేషయ్య అన్నారు. శనివారం మంగళగిరి కోర్టుల ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ లో ఆయన మాట్లాడారు. మొత్తంగా 544 కేసులు పరిష్కారమయ్యాయి. రూ. 62,25,615లక్షల నగదు చెల్లింపులు జరిగాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి ప్రత్యూష, వివిధ బ్యాంకుల అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పొన్నూరు రూరల్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ నేలపాడు, అమరావతి. వారి ఆదేశాల మేరకు శనివారం పొన్నూరు మండల న్యాయ సేవాధికార సంస్థ


మాట్లాడుతున్న పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు, డిఎల్ఎస్ఎ కార్యదర్శి రత్నకుమార్

ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ లో రాజీపడి తగిన క్రిమినల్ కేసులు 45 , సివిల్ కేసులు 17, ఎన్ ఐ యాక్ట్ కేసులు 2, బ్యాంకు పిఎల్‌సి కేసులు15 , ఎస్‌టిసి కేసులు 2 పరిష్కరించుకోవడం జరిగిందని, తద్వారా రూ.35.60,924 లక్షల లావా లావాదేవీలు పరిష్కారం జరిగింది. కక్షిదారులు వ్యయప్రయాసలకు లోనుకాకుండా ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవడం జరిగిందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. సత్య కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు అదనపు సివిల్ జడ్జి డి.శ్రీదేవి, కోర్టు సిబ్బంది, లోక్‌అదాలత్ సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు అడ్వకేట్లు, కక్షిదారులు పాల్గొన్నారు.



నారాయణప్రసాద్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ బృందం

కళాకారుడు నారాయణప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి:మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో శకపురుషుని శతజయంతి పేరిట ఏడాది పాటు నిర్వహించతలపెట్టిన ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఎన్టీఆర్ నటన, రాజకీయ జీవితంపై సమీక్ష జరిగింది. ముఖ్యవక్తలుగా ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, తాడికొండ జగన్మోహనరావు పాల్గొని ప్రసంగించారు. వక్తలతో పాటు పట్టణానికి చెందిన పౌరాణిక రంగస్థల నటుడు వెనిగళ్ళ నారాయణ శివప్రసాద్‌ను కళల కాణాచి సంస్థ వ్యవస్థాపకులు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. మల్లేశ్వరరావు, కె. శ్రీనివాస్, ఈ. వెంకటపూర్ణచంద్, ఎం. కోటేశ్వరరావు, డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పై నిలిచిన ఇసుక లారీ

ప్రజాశక్తి-తాడేపల్లి: రాజధానిలో భాగమైన పెనుమాక బొడ్రాయి సెంటర్‌లో శనివారం ఉదయం ఇసుక లారీ యాక్సెల్ రాడ్డు విరిగిపోవడంతో రోడ్డుపై నిలిచింది. బొడ్రాయి సెంటర్‌లో సింగిల్ రోడ్డు కావడంతో విజయవాడ నుంచి అమరావతి, సెక్రటేరియట్, తుళ్లూరు వైపు వెళ్లే బస్సుల దారి మళ్లించారు. ఎర్రబాలెం గ్రామం మీదుగా 8 కిలోమీటర్లు అదనంగా తిరిగి రావడంతో ప్రయాణికులు ఒకింత అసహనానికి గురయ్యారు. రైతులు తమ పంట పొలాల్లో నుంచి ఆటోల్లో మార్కెట్‌కు ఆకుకూరలు, కాయగూరలు తదితర పండిన పంటలను తరలించడంలో కూడా ఇబ్బంది పడ్డారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో భారీ వాహనాన్ని రిపేరు చేసి అక్కడి నుంచి తరలించారు.

కృత్రిమ జన్యుమార్పిడిపై విస్తృత చర్చ జరగాలి

ప్రజాశక్తి-గుంటూరు
ఆహార పంటల్లో కృత్రిమ జన్యు మార్పిడిలో మంచి, చెడులపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతునాయకులు, మేధావులు అన్నారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆహార పంటల్లో కత్రిమ జన్యు మార్పిడి అవసరమా అన్న అంశంపై సంస్థకార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన చర్చాగోష్టి నిర్వహించారు. ఎన్‌జి.రంగా విశ్వవిద్యాలయ విత్తనశాఖ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ఆహార పంటల్లో జన్యుమార్పిడి నేటి కాలంలో తప్పనిసరి అయిందన్నారు. అయితే ఈ జన్యుమార్పిడి ప్రభుత్వ సంస్థల ద్వారా జరిగితేనే ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మంచి ఆహారాన్ని పొందటం సాధ్యమన్నారు. పత్తి విత్తనాల మాదిరి సాంకేతికత అంతా కంపెనీల పరం కాకూడదన్నారు. రైతు నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ ఆహార పంటల్లో జన్యుమార్పిడి వల్ల చాలా ప్రమాదాలు ఉన్నాయని ఐరోపా దేశాల్లో అనుభవ పూర్వకంగా తెలుసుకొని ప్రజలు, ప్రభుత్వాలు ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పి. సుబ్బారెడ్డి

ప్రొఫెసర్ ఎన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ సాంకేతికాలవల్లనే వ్యవసాయరంగ సంక్షోభం పరిష్కరించపడుతుందనేది దురభిప్రాయమని అన్నారు. ప్రస్తుతం పరిశీలనలో వున్న జన్యు మార్పిడి ఆవాల విషయమై అందరూ ఆందోళనలో ఉన్నారన్నారు. వ్యవసాయ గ్రంథాల రచయిత జొన్నలగడ్డ రామారావు మాట్లాడుతూ విత్తన స్వాతంత్ర్యం దేశానికి కీలకమని, జన్యు మార్పిడి విషయం సామాన్య రైతుల దృష్టికి తీసుకువెళ్లాల్సివుంది అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టీవీ రత్నారావు, కిలారి రాజన్‌బాబు, కొరివి వినయ్ కుమార్, కొల్లి రంగారెడ్డి తదితరులు మాట్లాడారు.



డాక్టర్ రాధిక రాజశేఖర్‌ను సత్కరిస్తున్న గీతాకాంత్, మురళీకాంత్

విద్యార్థుల కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి-తెనాలి
విద్యారంగంలో వస్తున్న సమూల మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దటం అభినందనీయమని న్యూలైఫ్ చిల్డ్రన్ వైద్యశాల డాక్టర్ రాధిక రాజశేఖర్ అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు, పాఠ్యాంశాలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించేందుకు బోస్‌రోడ్డులోని నెహ్రూనికేతన్‌లో నిర్వహిస్తున్న రిఫ్లెక్షన్స్ కార్యక్రమంలో ఆమె శనివారం ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్, ఇంగ్లీష్, మాథ్స్ నమూనాలను ఆమె పరిశీలించారు. అలాగే పాఠ్యాంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన లఘు నాటికలను ఆమె తిలకించారు. పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. సాంకేతికను జోడించి, బోధనా పద్ధతులను అనుసరిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి చెప్పారు. పాఠశాల తరపున డాక్టర్ రాధిక రాజశేఖర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవినీతి అనకొండ ఎమ్మెల్యే ఆర్కే

పురావస్తుశాఖ సంప్రదింపులు లేకుండా కోనేరులో తవ్వకాలు

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని టిడిపి డిమాండ్

ప్రజాశక్తి -మంగళగిరి
కోనేరు అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, గుప్తనిధుల కోసం కోనేరు వద్ద అర్ధరాత్రి పర్యటనలు చేస్తున్నారని టిడిపి గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అరోపించారు. శనివారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండోమెంట్ నిధులు రూ.1కోటి, ఆలయ నిధులు రూ.50 లక్షలతో టెండర్లు పిలిస్తే తన బినామీ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారని, ఆ


మాట్లాడుతున్న పోతినేని శ్రీనివాసరావు, నాయకులు

కాంట్రాక్టర్ సొంతగా మనుషులను పెట్టి చేయించుకోవాల్సిన పనులను మున్సిపల్ కార్మికులను పెట్టి చేయిస్తున్నారని విమర్శించారు. పగలు పర్యవేక్షించాల్సిన పనులను అర్ధరాత్రులు తమ అనుచరులుతో వచ్చి పర్యవేక్షించడం వెనుక మతలబు ఏమిటో ప్రజలకు తెలియజేయాలన్నారు. రూ.1.50 కోట్లతో పనులు జరుగుతుంటే సీసీటీవీల పర్యవేక్షణ, పురావస్తు శాఖ సంప్రదింపులు లేకుండా చేయడం ఎమటని ప్రశ్నించారు. అక్కడి విద్యుత్ బిల్లులు టెండర్ దారులు కట్టాల్సి ఉన్నా అలా ఎందుకు జరగలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెద్దకోనేరు వద్ద టెండర్ వివరాలు జమా ఖర్చులపై బోర్డు పెట్టి ప్రజలకు తెలపాలని కోరారు. వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి టి.జానకి దేవి, పట్టణ పార్టీ అధ్యక్షులు డి. రాజు, మండల పార్టీ అధ్యక్షులు టి.పార్థసారథి, టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పి. ప్రేమ్ కుమార్, గుంటూరు పార్లమెంట్ బీసీ(సగర) సాధికార సమితి కన్వీనర్ పి. తిరుపతయ్య, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు జి. దుర్గారావు, గుంటూరు పార్లమెంట్ బీసీ సెల్ కార్యదర్శి వి.మంగారావు, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం పంపిణీలో ట్రూలివింగ్ హోప్ చారిటి బృందం

హెచ్‌ఐవి చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి
స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల ఏఆర్‌టి సెంటర్‌లో హెచ్‌ఐవితో బాధపడుతున్న చిన్నారులకు శనివారం పట్టణానికి చెందిన ట్రూలివింగ్ హెూప్ చారిటీ బృందం పౌష్టికాహారాన్ని పంపిణీ చేసింది. ఏఆర్‌టి సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహశ్రీ పంపిణీలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కందిపప్పు, రాగిపిండి, నువ్వుల ఉండలు, హార్లిక్స్, బెల్లంతో పాటు పేస్టులు, బ్రష్‌లు కూడా పంపిణీ చేశారు. మన్నవ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దాతలు గురిందపల్లి పవన్‌కుమార్, ఎ.రత్నప్రకాష్ ఆర్థిక ప్రోత్సాహంతో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఆర్‌జి కేర్, ఏఆర్‌టి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండల వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా అమృతయ్య

ప్రజాశక్తి -ప్రత్తిపాడు


వాసిమల్ల అమృతయ్య

మండల వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా వాసిమల్ల అమృతయ్య నియమితులైయ్యారు. శనివారం పార్టీ కార్యా లయం నుంచి విడుదలైన ప్రకటనలో కో -కన్వీనర్లుగా గండూరి రామకృష్ణ, రామనాల అనిల్ కుమార్, షేక్ బాజీలను కూడా నియమితులైనట్లు వాసిమల్ల అమృతయ్య తెలిపారు. వీరి నియామకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

కెఎల్‌యులో నాణ్యత ప్రామాణిక సదస్సు

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్
ఉన్నత విద్యా సంస్థలలో నాణ్యతను నిర్ధారించడం కోసం 5వ ఆవిష్కరణల మెకానిజం, నాణ్యత ప్రామాణిక సదస్సును కెఎల్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. కెఎల్‌యు ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ నిర్వహించిన ఈ సదస్సుకు ప్రో చాన్సలర్ డాక్టర్ కె.జగన్నాథరావు అధ్యక్షత వహించారు. 11 దేశాలకు చెందిన పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యా ప్రమాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా కెఎల్ విశ్వవిద్యాలయం నిలవడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో ముందుకు వెళ్లడానికి నాణ్యత హామీ వ్యవస్థ, ప్రమాణాలు,విధానాలను అభివృద్ధి చేయడంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను అధిగమించటానికి కృషి చేయడం. విద్యా భోధన, పరిశోధనలతో పాటు ఎక్సలెన్స్ ఫ్రేమ్‌వర్క్‌లో నాణ్యత హామీ ఇవ్వడం తో పాటు ఉన్నత విద్య నాణ్యతను సరిపోల్చడానికి అవకాశాలను జోడించడం వంటి పలు అంశాలపైన ఈ సదస్సులో చర్చించారు. రెండు రోజుల సదస్సులో ఐదుగురు ప్రముఖ అంతర్జాతీయ వక్తలు బహ్రెయిన్, మలేషియా, నైజీరియా, ఒమన్, యుకె వంటి దేశాలకు చెందిన విద్యావేత్తలు పాల్గొని ప్రసంగించారు. భారతీయ వక్తలలో నాక్ సలహాదారు చెందిన డాక్టర్ కె. రామ, ప్రొఫెసర్ అభిరామ కృష్ణ బద్రుక ఇతర ప్రముఖ వక్తలు ప్రసంగించారు. భారతదేశం నుండి 600 మంది అధ్యాపకులు ఈ సదస్సుకు హాజరయ్యారు.సదస్సు సందర్భంగా పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. వీటిలో అత్యుత్తమ పేపర్లకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్ధసారధి వర్మ, ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. జగదీష్, ఐక్యూఎసి సలహాదారు డాక్టర్ కె. కోటేశ్వరరావు, క్వాలిటీ డీన్ డాక్టర్ కె.రామకష్ణ, ఐక్యూఎసి డైరెక్టర్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు



బాలోత్సాహం

ఆకట్టుకున్న ప్రదర్శనలు - వేలాదిగా తరలి వచ్చిన విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో పిల్లల రెండ్రోజులపాటు పిల్లల పండుగ పేరుతో నిర్వహిస్తున్న గుంటూరు బాలోత్సవం శనివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రకరకాల వేషధారణలతో విద్యార్థులు, తల్లిదండ్రుల రాకతో పాఠశాల ప్రాంగణం కోలాహలంగా మారింది. తొలిరోజు ఫ్యాన్సీడ్రస్, ఏకపాత్ర, స్కిట్, వక్తృత్వం, పద్య పఠనం, స్పెల్‌బి, డ్రాయింగ్, పోట్రేట్, కేలియోగ్రఫీ, మట్టితో బొమ్మలు చేయటం వంటి పది అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి.

చిన్నారుల ఏకపాత్ర అభినయాలు అకట్టుకున్నాయి.అల్లూరి సీతారామరాజు, పిట్టల దొర వంటి పాత్రల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. వివిధ రకాల స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక వేత్తల వేషధారణలతో చిన్నారులు ఫ్యాన్సీడ్రస్ పోటీల్లో పాల్గొన్నారు. ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను తెలియజేస్తూ ప్లాస్టిక్ డబ్బాలను ఒంటికి ధరించిన విద్యార్థి ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే స్పైడర్‌మ్యాన్, యోగివేమన, హరిదాసు, ఝాన్సీలక్ష్మీభాయి, రుద్రమదేవి తదితర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. మట్టితో బొమ్మలు చేయటంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్ర లేఖనం పోటీలకు అనూహ్య స్పందన వచ్చింది. వందలాది మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

సమాజంలో దిగజారిపోతున్న విలువల గురించి అవగాహన పెంపొందించే విధంగా ప్రదర్శించిన స్కిట్‌లు ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారి పిల్లలకు మేకప్‌లు అద్ది, డైలాగ్స్ ప్రాక్టీస్ చేయించి, పోటీల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించారు. పోటీల అనంతరం ఆయా విభాగాల్లో మొదటి మూడు స్థానాలు నిలిచిన వారికి హిందూ కాలేజి ప్రిన్సిపాల్ పి.ఎం.ప్రసాద్, రిటైర్డ్ వ్యవసాయా శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, దీప్తి పబ్లికేషన్స్ నుండి ఎ.ఆంజనేయులు పాల్గొని మెమెంటోలు, సర్టిఫికెట్‌లు అందజేశారు.



కలెక్టర్‌తో సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు







ఫ్యాన్సీ డ్రెస్, ఏకపాత్రాభినయంలో పాల్గొన్న విద్యార్థులు



కూతురికి మేకప్ వేస్తున్న తల్లి



ఫ్యాన్సీ డ్రెస్, ఏకపాత్రాభినయంలో పాల్గొన్న విద్యార్థులు

మట్టితో బొమ్మలు చేస్తున్న విద్యార్థులు











డ్రాయింగ్‌కు హాజరైన విద్యార్థులు, డ్రాయింగ్ వేస్తున్న బాలిక